


మహిళా సంఘాల్లో.. వసూళ్ల దందా



- రుణాల మంజూరుకు కమీషన్ ఇవ్వాల్సిందే..
- తప్పులతడకగా ఖాతా పుస్తకాలు
- ఎర్రగొల్లపహాడ్‌లో రూ.కోటి వరకు దుర్వినియోగం?
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న అక్రమాలు
- ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదు

జనగామ టౌన్, ఫిబ్రవరి 16: గ్రామీణ మహిళల్లో పొదుపు అలవాట్లను పెంపొందించడంతో పాటు ఆర్థికాభివృద్ధికి, వ్యాపార అభివృద్ధికి దోహదం చేసేందుకు ఏర్పాటైన గ్రామైక్య సంఘాలు గాడి తప్పుతున్నాయి. వీటిని సక్రమమార్గంలో నడిపించాల్సిన నిర్వాహకులు అక్రమమార్గంలో నడుపుతున్నారు. మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులే ఎక్కువగా ఉండడంతో వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తప్పుడు లెక్కలతో మోసం చేస్తున్నారు. దీంతో కట్టాల్సిన డబ్బుల కంటే ఎక్కువగా కట్టి అమాయకులు మోసపోతున్నారు. మరోవైపు కొందరికి కిస్తీలు పూర్తి చేసినా మరింత అప్పు ఉన్నారంటూ లెక్కల పుస్తకాల్లో చూపించడంతో కంగు తింటున్నారు. ఇదే విషయమై జనగామ మండలంలోని ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన పలువురు గ్రూపు సభ్యులు ఇటీవల కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

ఎర్రగొల్లపహాడ్‌లో అక్రమాలు..

జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ గ్రామంలో ప్రియాంక, సుప్రియ గ్రూపుల పరిధిలో 50 మహిళా సంఘాలు నడుస్తున్నాయి. రెండు గ్రూపులకు కలిపి ఇద్దరు వీవోఏలు ఉన్నారు. వీరి పర్యవేక్షణలోనే గ్రామంలోని గ్రూపులన్నీ నడుస్తాయి. ప్రతీ గ్రూపులో సుమారుగా పది మంది సభ్యులుంటారు. ఒక్కో గ్రూపునకు అధ్యక్ష, కార్యదర్శులను నియమించి సంఘాలను నడిపిస్తారు. సంఘ సభ్యులకు అవసరానికి రుణాలు ఇచ్చి, తిరిగి వడ్డీతో వసూలు చేయడం సంఘాల పని. కానీ వడ్డీల విషయంలో, రుణాల మంజూరు విషయంలో భారీగా అవినీతి జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సభ్యులకు రూ.లక్ష రుణం ఇచ్చేందుకు వీవోఏలు రూ.2 వేల చొప్పున కమీషన్ వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఒక్కో సంఘానికి సుమారు రూ.10 లక్షల నుంచి 20 లక్షల వరకు మంజూరు చేస్తుంటారు. ఈ లెక్కన చూస్తే గ్రామంలోని 50 సంఘాలకు ఒకసారి రుణం మంజూరు చేస్తే రూ.20 లక్షల వరకు కమీషన్ వస్తుంది. ఇలా ఏళ్లతరబడి కమీషన్లు వసూలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు.

తీర్మానం లేకుండానే..

లోను మంజూరు చేయాలంటే సంఘంలోని అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సభ్యులంతా కలిసి తీర్మానం చేయాలి. కానీ సభ్యుల ప్రమేయం లేకుండానే ఇష్టారీతిన లోన్లు తీసుకున్నట్లు ఫిర్యాదులున్నాయి. తీర్మానం కాపీలు, అకౌంట్ పుస్తకాలు, పలువురు సభ్యులకు సంబంధించిన పాసు పుస్తకాలు కూడా వీవోఏల వద్దే ఉంచుకుని అక్రమాలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీటికి సంబంధించి అకౌంట్ బుక్‌లో తప్పుడు లెక్కలు రాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక వడ్డీల విషయంలో చాలా వ్యత్యాసం చూపించి సభ్యుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు కట్టిస్తున్నట్లు కూడా ఫిర్యాదులు వస్తున్నాయి.

పలు రూపాల్లో అక్రమాలు..

- గ్రామైక్య సంఘాల్లో అనేక రకాలుగా అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని సంవత్సరాల క్రితం ఓ మహిళను ఒక గ్రూపునకు అధ్యక్షురాలిగా నియమించారు. గ్రూపు సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేసి వాటిని బ్యాంకు ఖాతాలో వేయడం ఆమె పని. అయితే బ్యాంకు ఖాతా పుస్తకాలు వీవోఏ తీసుకుని ఆమెకు గ్రీన్ కార్డు ఇచ్చి బ్యాంకులో డబ్బులు వేయాలని సూచించారు. కానీ ఆ డబ్బులు మరో అకౌంట్‌లో జమ అయ్యాయి. ఈ విషయం ఆమె ఆలస్యంగా గుర్తించింది. ఇదేంటని వీవోఏను ప్రశ్నిస్తే తిరిగి అసలైన ఖాతాలో వేద్దాం అని చెప్పారు. తీరా కొన్ని నెలల తరువాత రుణం మంజూరు చేయాలని గ్రూపు సభ్యులు అడగ్గా రూ.2లక్షలు బకాయి ఉన్నట్లు చెప్పారు. సదరు గ్రూపు అధ్యక్షురాలు వీవోఏను నిలదీయగా తనకేం తెలియదని చెప్పేశారు. దీనిపై బాధితురాలు గ్రామసభ పెట్టించగా కొంత డబ్బులు కట్టించారు. మిగతా సభ్యులంతా ఆమె ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- అదే గ్రామానికి చెందిన మరో మహిళ రూ.లక్ష రుణం తీసుకున్నారు. వడ్డీ కలిపి నెలనెలా కిస్తీ చెల్లించారు. అయినా ఆమెకు అదనంగా రూ.60 వేలు వడ్డీ వేశారు. తీరా తన లెక్కలు చూడగా తాను డబ్బులను సొంతానికి వాడుకొని వారికి ఇష్టం వచ్చిన తేదీల లో బ్యాంకులో వేశారని తేలింది. ఫలితంగా ఆమెకు అదనపు వడ్డీ పడింది. ఇంత వడ్డీ ఎక్కడి నుంచి తేవాలని సదరు బాధితురాలు లబోదిబోమంటున్నారు.
- అదేవిధంగా దివ్యాంగుల గ్రూపులో ఓ వ్యక్తి రూ.58 వేల రుణం తీసుకున్నాడు. నెలకు రూ.1500 చొప్పున 12 నెలలకు కలిపి మొత్తం రూ.18 వేలు సంఘానికి చెల్లించాడు. ఇటీవల తన రుణ వివరాలు తెలుసుకోగా.. కేవలం రూ.3 వేలు మాత్రమే కట్టినట్లు చూపించారు. అదేంటని అడిగితే మరోసారి లెక్కలు సరిచూద్దామంటూ బుకాయిస్తూ వస్తున్నారు.
- కొన్నేళ్ల క్రితం సంఘ సభ్యుల ప్రమేయం లేకుండా తప్పుడు తీర్మానాలు, ఫోర్జరీ సంతకాలతో ఓ గ్రూపు పేరు మీద రూ.లక్ష తీసుకుని.. పెరల్స్(నిషేధించబడిన సంస్థ) అనే ఇన్సూరెన్స్ కంపెనీకి ప్రీమియం కట్టారు. ఈ విషయం వివాదాలకు దారితీసింది.
- ఇక 2017లో వాటర్‌షెడ్ పథకం ద్వారా అప్పటి ఇరిగేషన్ మంత్రి పొన్నాల లక్ష్మయ్య రూ.5,25,000 మంజూరు చేశారు. ఈ డబ్బులను సభ్యుల కోసం వినియోగించకుండా ప్రైవేటు ఫైనాన్సులకు వినిగించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల అకౌంట్ పుస్తకాలను చూస్తే కొన్ని అక్రమాలు తేటతెల్లమైనట్లు తెలుస్తోంది.
- 2020-21 సంవత్సరంలో ఓ సంఘానికి ఎలాంటి రుణం ఇవ్వలేదు. కానీ రూ.30 వేలు ప్రయాణ ఖర్చుల కింద చూపించారు. కార్యాలయం అద్దె రూ.4 వేలు చూపించారు. 2007 నుంచి ఖాతా పుస్తకాల్లో అద్దె చూపిస్తుండగా.. ఇంతవరకు గ్రామంలో కార్యాలయమే లేదని సభ్యులు చెప్పారు. మరోవైపు బుక్ కీపర్ వేతనం పేరుతో నెలకు రూ.10 వేలకు పైగా తీసుకుంటున్నారని, వీవోఏలకు జీతం ఉండగా.. బుక్ కీపర్ వేతనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా గ్రామైక్య సంఘాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని సంఘ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

డబ్బులు కట్టలేకనే నిందలు..

- మైలారం నాగరాణి, వీవోఏ, ఎర్రగొల్లపహాడ్

కొందరు కక్షపూరితంగా కావాలనే నిందలు వేస్తున్నారు. డబ్బులు వసూలయ్యాకే కొత్తగా రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఈ విషయంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నందుకు కొందరు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. తన వద్ద లెక్కలన్నీ సరిగ్గా ఉన్నాయి. ఏ విచారణకైనా నేను సిద్ధంగా ఉన్నా.

అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి...

- కీర్తి అశ్విని, రక్షిత గ్రూపు సభ్యురాలు



గ్రామైక్య సంఘాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలి. నేను గతంలో రూ.50 వేలు అప్పు తీసుకుని చెల్లించాను. రెండు కిస్తీలు అదనంగా కట్టినా మళ్లీ నాపైనా అప్పు చూపిస్తున్నారు. తప్పుడు లెక్కలతో సభ్యులను మోసం చేస్తున్నారు. ఉన్నతాధికారులు గ్రూపులపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి.



శివసత్తుల పూనకం.. నిలువెత్తు బంగారం..

మేడారం వనదేవతలకు భక్తుల ముందస్తు మొక్కులు

మేడారం, ఫిబ్రవరి 16 : మేడారం మహాజాతర ఘట్టానికి సమయం సమీపిస్తోంది. ఇప్పటికే నెలరోజులుగా భక్తులు ముందస్తు దర్శనాలు చేసుకుని మొక్కులు చెల్లించుకుంటుడగా.. శివసత్తుల పూనకాలు, నిలువెత్తు బంగారంతో వస్తున్న భక్తులతో మేడారం పరిసరాలు సందడిగా మారుతున్నాయి. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతుండగా శుక్రవారం లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు చెబుతున్నారు. శివసత్తుల పూనకాలు, భాజాభజంత్రీలు, డోలు సన్నాయి మేళాలు, సమ్మక్క సారలమ్మలకు జేజేలతో పరిసరాలన్నీ హోరెత్తుతున్నాయి. వనదేవతల మొక్కుల్లో భాగంగా భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కాలినడకన గద్దెలకు చేరుకుని.. పసుపు, కుంకుమ, చీర సారె సమర్పించి.. యాటమొక్కులు చెల్లించుకుంటున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పిస్తున్నారు. లక్షలాదిగా వస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం, జంపన్నవాగు తీరం కిటకిటలాడుతుండగా.. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో మేడారమంతా జాతర సందడి కనిపిస్తోంది.

వనదేవతలను దర్శించుకున్న కేంద్ర మాజీ మంత్రి

మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ కుటుంబ సమేతంగా తల్లులను దర్శించుకున్నారు. పూజారులు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. పూలు పండ్లు, కొబ్బరికాయ, బెల్లం తల్లులకు సమర్పించారు.

నేడు మేడారానికి నలుగురు మంత్రుల రాక



మేడారం, ఫిబ్రవరి 16: మేడారం జాతరకు శనివారం నలుగురు మంత్రులు రానున్నారు. ఈ ఏర్పాట్లను శుక్రవారం ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, మీడియా పాయింట్, హరిత హోటల్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ రవీందర్ తదితరులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

మహాజాతరకు ఆర్టీసీ రెడీ

- రేపటి నుంచి ప్రత్యేక బస్సులు
- 6వేల బస్సుల్లో 35లక్షల మంది భక్తుల తరలింపే లక్ష్యం
- మేడారంలో 55ఎకరాల్లో తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాటు

5లో

పరీక్షల ఒత్తిడిని అధిగమించాలి

విద్యార్థులకు కలెక్టర్ సూచన



పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ టౌన్, ఫిబ్రవరి 16: విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమించాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. జనగామ రైల్వేస్టేషన్ రోడ్డులో గల ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సిలబస్ వివరాలను తెలుసుకున్నారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ధర్మకంచలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విధులను నిర్లక్ష్యం చేస్తున్న పలువురు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీదేవి, డీఈవో రాము తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు కారు ఢీకొని యువకుడి మృతి

మరో నలుగురికి గాయాలు



సుధీర్ (ఫైల్)

కొడకండ్ల ఫిబ్రవరి 16: మండలంలోని రామవరం శివారు మూలమలుపు వద్ద కారు చెట్టుకు ఢీకొని బండారి సుధీర్(25) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామవరం గ్రామానికి చెందిన బండారి సుధీర్ శుక్రవారం ఉదయం నలుగురిని తీసుకొని స్టేషన్‌ఘన్‌పూర్‌కు కిరాయికి వెళ్లి తిరిగి వస్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సుధీర్‌కు తీవ్రంగా, మిగతావారికి స్వల్పంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన 108 వాహనంలో సుధీర్‌ను జనగామకు తరలిస్తుండగా మార్గంమధ్యలో తుదిశ్వాస విడిచాడు. ఆయనకు భార్య, పాప, బాబు (కవల పిల్లలు) ఉన్నారు. తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రవణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గాయపడ్డ వారిని జనగామ ఆస్పత్రికి తరలించారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య



హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 16 : తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిరిసిల్ల రాజయ్య నియమితులయ్యారు. చైర్మన్‌తో పాటు ముగ్గురు సభ్యులతో కూడిన కమిషన్‌ను రాష్ట్ర గవర్నర్ డాక్టరు తమిళిసై సౌందర రాజన్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌గా సిరిసిల్ల రాజయ్య నియమితులు కావడం పట్ల ఆయన సన్నిహితులు, పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. చైర్మన్ రాజయ్యతో పాటు ప్రకటించిన ముగ్గురు సభ్యుల్లో మహబూబాబాద్‌కు చెందిన

మిగతా 6వ పేజీలో...

రిజర్వాయర్లను వెంటనే నింపాలి

- చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పల్లా

జనగామ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గంలోని రిజర్వాయర్లను దేవాదుల జలాలతో వెంటనే నింపాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. గత ఏడాది ఇదే సమయంలో నియోజకవర్గవ్యాప్తంగా 120కి పైగా చెరువుల నిండి ఉండగా ప్రస్తుతం 5 నుంచి 10 చెరువులు కూడా నిండలేదని అన్నారు. రిజర్వాయర్లను నింపితే కాలువల ద్వారా పంటలకు నీరందే అవకాశం ఉందని, లేదంటే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని అన్నారు. అదేవిధంగా జిల్లా ఆస్పత్రిలో సీటీస్కాన్ యంత్రం పనిచేయడం లేదని, దీంతో బాధితులు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి, వరంగల్ ఎంజీఎంకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. దాని స్థానంలో కొత్త యంత్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలోని వేరుశనగ పంటకు సరైన ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని అన్నారు. చేర్యాల, కొమురవెల్లి, దూళ్మిట్ట, మద్దూరు మండలాలకు చెందిన ప్రజలు పనుల రీత్యా గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. వీటి పరిధిలో 2 లక్షలకు పైగా జనాభా ఉందన్నారు. ప్రభుత్వం రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తే అవసరమయ్యే కార్యాలయాల సముదాయం కూడా సిద్ధంగా ఉందని అన్నారు. ఇదే అంశంపై గతంలో ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం డిమాండ్ చేశారని గుర్తు చేశారు.

సైనిక్‌స్కూల్‌ను తరలించొద్దు: ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ధర్మసాగర్ మండలం ఎల్కుర్తికి 2016లో మంజూరైన సైనిక్ స్కూల్‌ను ప్రస్తుత ప్రభుత్వం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తోందని, దాన్ని వెంటనే విరమించుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి కేంద్ర రక్షణశాఖ మంత్రి మనోహర్ పారికర్ వద్దకు తాను స్వయంగా డిప్యూటీ సీఎం హోదాలో వెళ్లి తన నియోజకవర్గానికి సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు కృషి చేశానన్నారు. దీనికి 2017లో అగ్రిమెంట్ కూడా జరిగిందని, ఎల్కుర్తిలో 49.32 ఎకరాల భూమిని కేటాయించామని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవలే కేంద్రం దేశవ్యాప్తంగా 100 సైనిక్ స్కూళ్లను మంజూరు చేసిందని, తెలంగాణ ప్రభుత్వం చొరవతీసుకుంటే మూడు నుంచి నాలుగు సైనిక్‌స్కూళ్లను తెచ్చుకునే అవకాశం ఉందని అన్నారు. అంతేకానీ ఇక్కడి సైనిక్ స్కూల్‌ను తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. అదేవిధంగా మడికొండ, రాంపూర్, ధర్మసాగర్‌ల మధ్య ఉన్న డంపింగ్ యార్డు కారణంగా భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని వెంటనే యార్డును అక్కడి నుంచి తరలించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వ అధికారిక చిహ్నం నుంచి కాకతీయుల కళాతోరణం, చార్మినార్ చిహ్నాలను తొలగించొద్దని సూచించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం

కుల గణనతో బీసీల జీవితాల్లో మార్పు

సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు



జనగామలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ నాయకుల సంబరాలు

జనగామ టౌన్, ఫిబ్రవరి 16: బీసీ కుల గణన కోసం తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం హర్షణీయమని, ఈ ప్రక్రియతో బీసీల జీవితాల్లో వెలుగులు నిండుతాయని కాంగ్రెస్ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు లోక్కుంట్ల ప్రవీణ్ అన్నారు. అసెంబ్లీలో తీర్మానంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో జనగామ ఆర్టీసీ చౌరస్తాలో బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం బీసీ కులగణనకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. భారతదేశ చరిత్రలోనే ఇది గొప్ప అధ్యాయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులుభట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటే శ్రీనివాస్, ఆకుల లక్ష్మయ్య, దామెర నాగరాజు, మోర్తాల ప్రభాకర్, బస్వగాని అనిల్‌గౌడ్, చెరుకూరి శ్రీనివాస్‌యాదవ్, బండారి ప్రభాకర్, మచ్చ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య



రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి16: స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి పొంగులేటితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరికపై మంతనాలు జరిపినట్లు సమాచారం. త్వరలో పార్టీలో చేరడానికే ఆయన సీఎంతో భేటీ అయినట్లు తెలుస్తోంది.

త్వరలోనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం

జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

వివరాలు 6వ పేజీలో

ప్రధాని మోదీని గద్దె దించుదాం

కార్మిక సంఘాల డిమాండ్


సమ్మె సందర్భంగా ర్యాలీ నిర్వహించిన నాయకులు




జనగామలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

జనగామ టౌన్, ఫిబ్రవరి 16: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రధాని మోదీని గద్దె దించుతామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం సీఐటీయూ, బీఆర్‌టీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐకేఎస్, జేఏడీయూ, ఏఐఏడబ్ల్యూయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందునాయక్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు రాపర్తి రాజు, మోకు కనకారెడ్డి, వేముల నర్సింగం, శ్రీదేవి, జేరిపోతుల కుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2022 విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలన్నారు. పంటలకు మద్దతు ధర చట్టం తేవాలన్నారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమంపై దౌర్జన్యం ఆపాలన్నారు. కార్మిక, ప్రజా డిమాండ్లను పరిష్కరించకుంటే బీజేపీని చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు సుంచు విజేందర్, జోగు ప్రకాశ్, పి.ఉపేందర్, బొట్ల శేఖర్, ఇర్రి అహల్య, పి.లలిత, మీట్యానాయక్, శంకరయ్య, దేవదానం, గంగాపురం మహేందర్, మంగ బీరయ్య తదితరులు పాల్గొన్నారు.









భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 16 : వివాహేతర సంబంధం ఉన్నదనే అనుమానంతో భార్యను వేధింపులకు గురి చేసి హత్యకు పాల్పడిన ఎమ్డీ అయూబ్ ఖాన్ అనే కానిస్టేబుల్‌కు యావజ్జీవ కారాగార శిక్షా , రూ. 10 వేలు జరిమానా విధి స్తూ వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి కోకా రాధాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివ రాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రం అశోక్ నగర్‌కు చెందిన తస్నీన్ సుల్తా నాను వరంగల్ జిల్లా పెన్షన్‌పుర గ్రామానికి చెందిన ఎమ్డీ అయూబ్ ఖాన్‌కు ఇచ్చి 2006 సంవ త్సరంలో వివాహం జరిపించారు. ప్రస్తుతం ఆయూబ్ ఖాన్ రఘునాథపెల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తు న్నాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, 2019 నుంచి భార్య ప్రవర్తనను అనుమానిస్తూ వివా హేతర సంబంధం కొనసాగిస్తుందన్న నేపంతో శారీరకంగా, మానసికంగా వేధిస్తుం డేవాడు. ఎన్నిసార్లు అత్తింటివారు సర్ది చెప్పినా నిందితు డిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో 2020 జూ న్ 5న తస్నీన్ సుల్తానా తన అన్న సాదిక్ హు స్సేన్‌కు ఫోన్‌చేసి ఎప్పటిలాగా తనను అను మానిస్తూ వేధిస్తున్నాడని చెప్పింది. తన తల్లిద ండ్రులను అదే రోజు చెల్లెల్లి అత్తగారింటికి పంపించి మరునాడు జూన్ 6న సాయంత్రం సాదిక్ హుస్సేన్ చెల్లెలి ఇంటికి వెళ్లాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులతో విషయం తెలుసుకోగా తస్నీన్ సుల్తానాను నిందితుడు బయటకు తీసుకెళ్లా డని తెలిపారు.విషయంపై విచారిం చగా మామునూరు క్యాంపులోని పాత క్వార్టర్స్‌లో తన చెల్లె కనిపించిందని ముఖంపై గాయాలతో, గొంతు బిగించి మృతి చెంది ఉంది. దీంతో తన చెల్లెలు తస్నీన్ సుల్తాన్‌ను నింది తుడు అనుమా నంతో చంపాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీరించిన మాము నూరు పోలీసులు నిందితుడిపై హత్యానేరం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున ఎమ్డీ అయుబ్‌ఖాన్‌కు జీవిత ఖైదు, రూ . 10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఆజ్మీరా సాంబూ నాయక్ సాక్షులను ప్రవేశ ెట్టగా లైజనింగ్ అధికారిగా ఎం. వెంకటస్వామి, దర్యాప్తు అధికారిగా అప్పటి సీఐ సార్ల రాజు వ్యవహ రించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

ఎంజీఎంలో అనుమానాస్పద వ్యక్తులు..

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 16: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో కలకలం రేగింది. గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు ఎంజీఎం ఆస్పత్రిలోని పిల్లల వార్డుకు చేరుకున్నారు. మా అమ్మాయి కనిపించడం లేదంటూ వార్డులోని ఎన్ఐసీ యూకు వెళ్లారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సెక్యూరిటీ గార్డులు అక్కడకు చేరుకొని వారిని ఆస్పత్రికి బయటకు పంపించారు. కాగా,, రాత్రి 11 గంటల ప్రాంతంలో మరోసారి పిల్లల వార్డు ముందు తిరుగు తూ కనిపించారు. దీంతో అనుమానం వచ్చిన స్థానికులు వారిని చితకబాది పోలీ సులకు అప్పగించారు. ఆడ, మగ వ్యక్తులు అనుమానాస్పదంగా ఎంజీఎంలో పిల్లల వార్డు సమీపం లో తిరుగుతున్నారని పోలీసులు చెప్పారు. పూర్తి వివరాలు రాబడుతున్నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

భూపాలపల్లిలో పిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చాడని...

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 16: పిల్లలను ఎత్తుకెళ్లే వారు సంచరిస్తున్నారనే వందతులు వ్యాపించిన నేపథ్యంలో ఓ వ్యక్తిని కాలనీవాసులు పట్టుకొని తాళ్లతో కట్టి చితక బాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన భూపాలపల్లి పట్టణం లోని ఎల్బీనగర్‌లో చోటుచేసుకుంది. కాలనీలో ఇద్దరు వ్యక్తులు శుక్రవారం తెల్లవారు జా మున సంచరిస్తుండగా స్థానికుడు ఒకరు గమనించాడు. వెంటనే చుట్టుపక్కల వారిని పిలి చి విషయం చెప్పాడు. దీంతో అప్రమత్తమైన కాలనీవాసులు ఆ ఇద్దరు వ్యక్తులను పట్టుకు నేందుకు యత్నించారు. వీరిలో ఒకరు ద్విచక్రవానంపై పరారు కాగా మరొకరు కాలనీవా సులకు పట్టుబడ్డాడు. దీంతో అతడిని తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు. ఆ వ్యక్తి వరంగల్‌కు చెందిన వాడని తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. అతడి పేరు రాజు అని, తాను పందులు పట్టేందుకే వచ్చానని తమకు చెప్పాడని పేర్కొన్నారు.

దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజు చెల్లింపు గడువు 15

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ కోర్సుల ద్వితీయ, తృతీయ సంవత్సరంతో పాటు పీజీ రెండోవ ఏడాది పరీక్ష ఫీజులను మార్చి 15 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం,(జనరల్, కంప్యూటర్) బీబీఏ, బీఎస్సీతో పాటు పీజీ రెండోవ ఏడాది కోర్సుల విద్యార్థుల తమ పరీక్షల ఫలితాల కోసం వేచిచూడకుండా కోర్సుల ఫీజులు చెల్లించుకుని స్టడీ మెటీరియల్ పొందాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 0870-2461480, 2461490లో సంప్రదించాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. ఇదిలా ఉండగా దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ మొదటి ఏడాది పూర్తైన అభ్యర్థులందరూ రెండో ఏడాదికి కోర్సు ఫీజులను ఎలాంటి అపరాధ రుసుం లేకండా మార్చి 15 వరకు చెల్లించుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడించారు.

లంసం, క్యాజువల్


ఉద్యోగులకు న్యాయం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి




సమ్మెలో ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కేయూలో పనిచేస్తున్న లంసం, క్యాజువల్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో అప్‌గ్రేడ్ చేసి న్యాయం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఉద్యోగుల సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో కేయూ పరిపాలన భవనం ఎదుట నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కచ్చకాయల చిరంజీవి ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. కేయూలో తాత్కాలిక ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి అప్‌గ్రేడ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని అన్నారు. అనంతరం కేయూ సీఐటీయూ నాయకులు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌ను కలిసి వర్సిటీ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రాన్ని అందచేశారు. సానుకూలంగా స్పందించి 4 రోజుల్లో ఉద్యోగులతో భేటీ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు ఆకుతోట రాంచందర్, కార్యదర్శి దేశిని రవికుమార్, ఉపాధ్యక్షుడు పల్లం రాజు, మధు, ట్రెజరర్ ఎం.రాజేందర్, సందీప్, కృష్ణ, శోభ. లక్ష్మి, రాణి, సరోజన తదితరులు పాల్గొన్నారు.









కేంద్రం నుంచి రూ.3కోట్లు

మేడారం జాతరకు కేటాయిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడారం మహాజాతరపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో 'మేడారం జాతరకు కేంద్రం మొండి చేయి.. తెలంగాణ కుంభమేళాకు పైసా ఇవ్వని మోదీ సర్కార్' అనే కథనానికి కేంద్ర ప్రభుత్వం స్పందించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ మేరకు ప్రకటన చేశారు. మేడారం మహాజాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో మహాజాతరలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. కాగా, 2020 జాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.6.10 కోట్లు ఇవ్వగా, 2022 జాతరకు రూ.2.50 కోట్లు మాత్రమే ఇచ్చింది. తాజాగా కిషన్‌రెడ్డి రూ.3 కోట్లు ఇస్తామని ప్రకటించటంతో భక్తుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం జాతర జరగనుంది. ఇందు కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించింది.

మేడారానికి ప్రత్యేక రైళ్లు

21నుంచి నడపనున్నట్లు రైల్వే శాఖ వెల్లడి

గిర్మాజీపేట (వరంగల్), ఫిబ్రవరి 16 : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు హాజరయ్యే ఈ జాతరకు సికింద్రాబాద్, నిజామాబాద్‌ల నుంచి వరంగల్ వరకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని దక్షిణమధ్య రైల్వే శుక్రవారం రాత్రి ప్రకటించింది.

సికింద్రాబాద్ నుంచి..

మేడారం మహాజాతర ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో ప్రతి రోజు ఉదయం 9.52 గంటలకు బయలుదేరి కాజీపేటకు మధ్యాహ్నం 12.12 గంటలకు, వరంగల్‌కు ఒంటిగంటకు చేరుకుంటుంది. తిరిగి అదే మధ్యాహ్నం 1.55 గంటలకు వరంగల్‌లో బయలుదేరి కాజీపేట మీదుగా సాయంత్రం 6.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక మేడారం రైలు మౌలాలి, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, యాదగిరి, వంగపల్లి, ఆలేరు, పెంబర్తి, జనగామ, రఘునాథపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, పెండ్యాల్, కాజీపేటలో ఆగుతుంది. ఈ నెల 21 నుంచి 25 వరకు ప్రతి రోజు ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్-వరంగల్ మధ్య నడుస్తుంది.

నిజామాబాద్ నుంచి..

నిజామాబాద్ నుంచి మేడారం ప్రత్యేక రైలు ఈ నెల 21 నుంచి 24 వరకు సికింద్రాబాద్ మీదుగా కాజీపేట, వరంగల్ వరకు నడుస్తుంది. ఈ నాలుగు రోజుల్లో మేడారం ప్రత్యేక రైలు ప్రతీ రోజు ఉదయం 7.05 గంటలకు నిజామాబాద్‌లో బయలుదేరి సికింద్రాబాద్‌కు 11 గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి ఉదయం 11.10 గంటలకు బయలుదేరి కాజీపేటకు మధ్యాహ్నం 1.15 గంటలకు, వరంగల్‌కు 1.45 గంటలకు చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు వరంగల్‌లో బయలుదేరి 3.15కు కాజీపేటకు చేరుకుంటుంది. కాజీపేట నుంచి మధ్యాహ్నం 3.20 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు జనగామ, సాయంత్రం 5.30 గంటకు సికింద్రాబాద్‌కు, రాత్రి 10.30 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుంది. నిజామాబాద్ నుంచి వరంగల్‌కు నడిచే ఈ ప్రత్యేక రైలు కామారెడ్డి, అకన్నపేట, మిర్జాపల్లి, వాడిరాం, మనోహరాబాద్, మేడ్చల్, బొల్లారం, మల్కాజిగిరి, సికింద్రాబాద్, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, వంగపల్లి, ఆలేరు, జనగామ, రఘునాథపల్లి, స్టేషన్ ఘనపూర్, పెండ్యాల్, కాజీపేట స్టేషన్‌లలో ఆగుతుంది. ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా వచ్చే భక్తులు కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేసిన మేడారం బస్‌స్టేషన్‌ల నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారం వెళ్లేందుకు జిల్లా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు



కమాండ్ కంట్రోల్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, ఫిబ్రవరి 16: మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం మేడారంలో పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో దీనిని ఏర్పాటు చేయగా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా టోల్ ఫ్రీ నంబరు 18004250620 అందుబాటులో ఉంటుందని క తెలిపారు. జాతర పరిసరాల్లో మొత్తం 382 సీసీ కెమారాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని అన్నారు. భక్తుల భద్రతా దృష్ట్యా జాతరలో ఎనిమిది జోన్లుగా 42 సెక్టార్లుగా విభజించి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ పాల్గొన్నారు.

మహాజాతరకు ఆర్టీసీ రెడీ

రేపటి నుంచి ప్రత్యేక బస్సులు - 6వేల బస్సుల్లో 35 లక్షల మంది భక్తుల తరలింపే లక్ష్యం - మేడారంలో 55ఎకరాల్లో తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాటు



మేడారంలో భక్తుల కోసం సిద్ధంగా ఉన్న తాత్కాలిక బస్టాండ్

సుబేదారి, ఫిబ్రవరి 16 : మేడారం మహాజాతరకు భక్తులను తరలించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి ఆరు వేల బస్సుల ద్వారా 35లక్షల మంది భక్తులను తల్లుల చెంతకు చేర్చాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే జాతర రోజుల్లో భక్తుల రద్దీకి తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచుతూ ఆదాయాన్ని పెంచుకునే దిశగా ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇక ఆదివారం నుంచి మేడారానికి బస్సు సర్వీసులను ప్రారంభించనున్న అధికారులు మేడారంలో 55 ఎకరాల్లో తాత్కాలికంగా ఆర్టీసీ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ జిల్లాలు, ప్రాంతాల వారీగా క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. అలాగే బస్సుల మరమ్మతులకు షెడ్లు, ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు, అధికారులకు వసతి షెడ్లు, తాగునీటి, మరుగుదొడ్లు, ప్రయాణికుల కోసం విశ్రాంతి షెడ్లను నిర్మించారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం అత్యవసర వైద్య సేవలను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గద్దెల వరకు భక్తులను చేర్చేలా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. బస్సుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు భక్తులకు తెలియజేసేందుకు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లను జాతరలోని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్‌శాఖకు అనుసంధానం చేస్తున్నారు. జాతర కోసం 6 వేల ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయగా వాటిలో వరంగల్ రీజియన్ నుంచే సుమారు 2500 బస్సులను నడపనున్నారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా బస్సులను నడిపించేందకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 12,300 మంది ఆర్టీసీ సిబ్బంది విధుల్లో ఉండనుండగా మరో 500 మంది అధికారులు సేవలను పర్యవేక్షించనున్నారు.

ఫ్రీ టిక్కెట్‌తో పెరగనున్న మహిళా భక్తుల సంఖ్య

నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఈ క్రమంలోనే ఈసారి మేడారం వెళ్లే మహిళా భక్తులకు కూడా ఉచిత ప్రయాణ అవకాశం ఇస్తున్నట్టు ప్రకటించడంతో జాతరకు మహిళల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఆర్టీసీకి మహిళా ప్రయాణికుల ద్వారా లాభం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు.

భక్తులకు ఆర్టీసీ సేవలు విస్తృతం

జాతరకు వచ్చే భక్తులు ఎక్కువమంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకే ఆసక్తి చూపుతున్నారు. ప్రతీజాతరకు ఆర్టీసీ తన సేవలను విస్తృతం చేస్తోంది. 1996లో మేడారం జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించినప్పటి నుంచి ఆర్టీసీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. అయితే ప్రధానంగా 2008 నుంచి ఆర్టీసీ సేవలు విస్తృతమయ్యాయి. 2008లో 2,688 బస్సులను నడిపి 12 లక్షల మంది భక్తులను ఆర్టీసీ చేరవేసింది. 2010లో 3వేల బస్సుల ద్వారా 14లక్షల మందిని, 2012లో 3,100 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను తమ గమ్య స్థానాలకు ఆర్టీసీ చేరవేసింది. ఇక 2014లో 3,160 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను, 2016లో 3,382 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను ఆర్టీసీ చేరవేసింది. ఇక గత 2018 మహాజాతరలో 4వేల బస్సులతో 18లక్షల మంది భక్తులను తరలించారు. అయితే 2018లో రాష్ట్ర వ్యాప్తంగా 3,565 బస్సులతో 41వేల ట్రిప్పుల ద్వారా 18లక్షల మందిని తరలించగా, 2020 మహాజాతరలో 3,860 బస్సుల ద్వారా 45వేల ట్రిప్పులను నడిపి 19లక్షల మంది భక్తులను గమ్య స్థానాలకు చేర్చారు. 2022 జాతరలో 3,845 బస్సుల ద్వారా 21లక్షల మంది భక్తులను జాతరకు తరలించారు. ప్రస్తుతం 6వేల బస్సుల ద్వారా భక్తులను జారతకు చేర్చేందుకు ఆర్టీసీ సిద్ధమయింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా బస్సు పాయింట్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.

భక్తులు సహకరించాలి

జె.శ్రీలత, ఆర్టీసీ ఆర్‌ఎం, వరంగల్ రీజియన్



మేడారంకు వచ్చే భక్తులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. గత జాతర కంటే అధికంగా భక్తులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా ప్రయాణించాలి. ఈ నెల 18 నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా బస్సుసౌకర్యం కల్పించడంతో ఈ సారి ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

గత జాతరల్లో భక్తులకు అందించిన సేవలు

ఏడాది	బస్సులు	ప్రయాణికులు
2008	2,688	12లక్షలు
2010	3,000	14లక్షలు
2012	3,100	14లక్షలు
2014	3,160	14లక్షలు
2016	3,382	14లక్షలు
2018	3,565	18లక్షలు
2020	3,860	19లక్షలు
2022	3,845	21లక్షలు

జాతరపై సాంకేతిక పర్యవేక్షణ

ట్రాఫిక్, భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు
సాఫ్ట్‌వేర్ వినియోగం, సీసీ కెమెరాల ఏర్పాటు
వివిధ ప్రాంతాల సమాచారంతో ప్రత్యేక యాప్ రూపకల్పన

భూపాలపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గిరిజన కుంభమేళాగా గుర్తింపు పొందిన మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో అత్యంత ముఖ్యమైన ట్రాఫిక్, భక్తుల రద్దీ నియంత్రణ, పోలీసు నిఘాపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ అంశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సాంకేతికతను వినియోగిస్తోంది. ప్రధానంగా రద్దీ నియంత్రణ కోసం జాతరలో ఎంపిక చేసిన కీలక ప్రాంతాల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన కెమెరాలను ఏర్పాటు చేసి.. వీటిని కంట్రోల్ రూంకు అనుసంధానించి వీటి ద్వారా చదరపు మీటరులో నలుగురికంటే ఎక్కువ మంది గుమిగూడిన ప్రాంతాలను గుర్తించి, రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టనున్నారు. అలాగే భక్తుల సంఖ్యను లెక్కించే క్రౌడ్ కౌటింగ్ కెమెరాలు, వాహనాల సంఖ్యను అంచనా వేసేందుకు నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. మేడారం క్షేత్రంలోని ప్రధాన మార్గాలు, కూడళ్లు, గద్దెల ప్రాంగణం, పార్కింగ్ స్థలాల్లో మొత్తం 500కు పైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. కంట్రోల్ రూంకు అనుసంధానమై ఉండే వీటి ద్వారా 24గంటల నిఘా ఉండేలా చూస్తారు. నిఘాను మరింత పటిష్ఠం చేసేందుకు గాను డ్రోన్ కెమెరాలను కూడా వినియోగించనున్నారు. ఇక వీటి నిర్వహణకు నిపుణలైన సిబ్బంది సహకారం తీసుకుని.. ఆయా ప్రాంతాలపై దృష్టి పెట్టనున్నారు.

జాతర వివరాల ప్రత్యక్ష ప్రసారానికి ఎల్‌ఈడీ తెరలు

మేడారంలోని పలు ప్రాంతాల్లో ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేసి జాతర వివరాలు, విశేషాలు, తప్పిపోయిన వారి వివరాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. వాహనాల పార్కింగ్ కోసం 1400 ఎకరాల మేర విస్తరించి ఉన్న 33 పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తేనుండగా..



భక్తుల కోసం ఆర్టీసీ ఆరు వేల బస్సులను నడపాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అటంకాలు లేకుండా నియంత్రణ పకడ్బందీగా జరిగేలా ఇప్పటికే వలంటీర్లు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్

మేడారం, ఫిబ్రవరి 16: మేడారం జాతరలో విధులు నిర్వర్తిస్తున్నమన అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. మరో నాలుగు రోజుల్లో మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో సెక్టోరియల్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. మేడారంలోని గిరిజన బాలిక ఇంగ్లిష్ ఆశ్రమ పాఠశాలలో సెక్టోరియల్ అధికారులకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ కార్యక్రమంలో పీవో మాట్లాడారు. మహాజాతర విధుల్లో పాల్గొనే అధికారులు ఈనెల 19న రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబద్ధతతో పనిచేసి మహాజాతరను విజయవంతం చేయాలన్నారు. జంపన్నవాగు వద్ద విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం ఏమరపాటుగా ఉండొద్దని అన్నారు. జాతర పరిసరాల్లో ఆర్‌అండ్‌బీ అధికారులు సూచిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. జన సమూహంలో నిరంతరంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు.

పరిసరాల్లో దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు రసాయనాలతో శుభ్రం చేస్తుండాలన్నారు. భక్తుల ఆరోగ్యాన్ని కాపాడాలని, అవసరమైతే తక్షణమే వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సెక్టార్ల వారీగా సిబ్బందికి విధులు అప్పగించాలన్నారు. జాతరలో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. పేపర్, క్లాత్, జూట్ బ్యాగులను మాత్రమే భక్తులు వినియోగించేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా జరుపుకోవాలనే సందేశం ప్రతి ఒక్కరికీ తెలియాలని సూచించారు. గద్దెల వద్ద విధులు నిర్వహించే అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకన్న, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ఐటీడీఏ ఏపీవో వసంతరావు పాల్గొన్నారు.



సెక్టార్ అధికారులతో మాట్లాడుతున్న పీవో అంకిత్



మేడారంలోని తల్లుల గద్దెల వద్ద భక్తుల కోలాహలం



బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలచరిస్తున్న భక్తులు



బంగారాన్ని తల్లులకు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు



జంపన్న వాగులో స్నానమాచరిస్తున్న భక్తులు

నేడు కేయూకు నిజనిర్ధారణ కమిటీ

వర్సిటీ అధికారులు, విద్యార్థులతో ముఖాముఖీ
కమిటీ రాకతో వర్సిటీలో సర్వత్రా ఉత్కంఠ

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ఉన్నతా విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియామించింది. ఈ మేరకు శనివారం కాకతీయ యూనివర్సిటీకి త్రిసభ్య కమిటీపీహెచ్‌డీ అడ్మిషన్లపై నిజనిర్ధారణకు రానుంది. ఈ మేరకు వర్సిటీ ఉన్నతాధికారులకు నిజానిర్ధారణ కమిటీ పర్యటన వివరాలను లేఖలో వర్సిటీకి తమ పర్యటన షెడ్యూల్‌ను అధికారికంగా తెలియజేసింది.

ఫిబ్రవరి 17 ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు వీసీతో ప్రాథమిక చర్చలు, 11.15- 12.15 వరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల సంబంధిత అధికారులతో చర్చలు, 12.30 నుంచి 1.15 వరకు, 2.15 3.30 రెండు దఫాలుగా విద్యార్థుల నుంచి పీహెచ్‌డీ-2 అడ్మిషన్లలో చోటుచేసుకున్న పరిణామాలు, విద్యార్థుల అభ్యంతరాలను వినతి పత్రాల ద్వారా నిజా నిర్ధారణ కమిటీ స్వీకరిస్తోంది. సాయంత్రం 3.45 గంటల నుంచి 4 గంటల వరకు నిజానిర్ధారణ కమిటీ సేకరించిన వివరాలను సమ్ఆఫ్ చేసి పర్యటన ముగిస్తారు. కాగా, కమిటీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైర్మన్ ప్రొఫెసర్ వి. వెంకటరమణ పీహెచ్‌డీ నిజానిర్ధారణ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించగా ఆయనతో పాటు మరో ఓయూ జియాలజీ విభాగం ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు రానున్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకుని వర్సిటీ చరిత్రలో మొదటి దఫా నిజానిర్ధారణ కమిటీ వేసి విచారణ జరిపించడం పట్ల సర్వత్రా చర్చనీయంగా మారింది. నిజానిర్ధారణ కమిటీ రిపోర్టు పీహెచ్‌డీ అడ్మిషన్ల లోగుట్టును బట్టబయలు చేయనుందని వర్సిటీలో చర్చలు జోరందుకున్నాయి.

అజర ఆస్పత్రిలో పునరావాస కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న డాక్టర్ కాళీప్రసాద్

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 16 : హనుమకొండ ములుగురోడ్‌లోని అజర హాస్పిటల్‌లో ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇకపై హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే అజర హాస్పిటల్‌లో తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్యం పొందవచ్చని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బండారు శివసుబ్రమణ్యం తెలిపారు. అత్యాధునికమైన యూఎస్ ఇంపోర్టెడ్, ఎలక్ట్రో థెరపీ యూనిట్‌తో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దివ్వెల మోహన్‌దాస్, వలపదాసు చంద్రశేఖర్, పగడాల కాళీప్రసాద్, మాగంటి శేషుమాధవ్, కె.నాగార్జునరెడ్డి, ఎమ్డీ.అన్వర్, బి.శ్రీనివాస్, అప్పాల సుధాకర్, పెరుమాండ్ల రామకృష్ణ, వంశీ, హరీష్ పాల్గొన్నారు.

కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు

ఉత్తర్వులు జారీచేసిన సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 16: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐతే కొందరు ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడం, మరి కొందరిపై కొన్ని ఆరోపణలు రావడంతో స్థానచలనం చేసినట్టు తెలుస్తోంది.

పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
వై. సుధాకర్‌రెడ్డి	కమిషనరేట్	కాజీపేట
సీహెచ్ శ్రీధర్	కేయూసీ	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్) వరంగల్
వి. చేరాలు	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్)	వరంగల్ కేయూసీ
డి. రవిరాజు	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్)	వరంగల్ పరకాల
ఎం. అబ్బయ్య	పరకాల	సీసీఎస్ వరంగల్

నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 16 : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం, మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు కార్యక్రమాల నిర్వహణకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ.. ఈ నెల 20న జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వరకు వయస్సున్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు.

జిల్లాలో 2 లక్షల 33వేల 500 మంది పిల్లలకు ఈ మాత్రలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. మార్చి 3వ తేదీన జిల్లాలో 79వేల 227 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వైవి.గణేష్, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, డీఐఓ డాక్టర్ వాణిశ్రీ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ హిమబిందు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

గుడుంబా తయారీదారులపై కేసు నమోదు

కొడకండ్ల ఫిబ్రవరి 16: మండలంలో గుడుంబా తయారుచేస్తున్నవారిపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి పెదబావితండా వద్ద అమ్రుతండాకు చెందిన తండా నారాయణ తన ద్విచక్ర వాహనంపై 5 లీటర్ల గుడుంబా తీసుకెళ్తూ పట్టుబడ్డాడని, నిందితుడిని విచారించగా అదే తండాకు చెందిన లూనావత్ కలమ్మ వద్ద కొనుగోలు చేసి లక్ష్మక్కపెల్లి గ్రామానికి చెందిన గుండెబోయిన లక్ష్మికి అమ్మడానికి తీసుకెళ్తున్నట్లు తెలిపాడని పోలీసులు తెలిపారు. గుడుంబాతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని తండా నారాయణ, లూనావత్ కలమ్మ, గుండెబోయిన లక్ష్మిలపై కేసు నమోదు చేశామని సీఐ సంతోష్ రెడ్డి వివరించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ పద్మ, స్పింది సర్వర్, నవీన్, రాజమోహన్, సుజాత, కుమారస్వామి, పాషా పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో గురుకులాలను ఏర్పాటు చేయాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 16: మండలకేంద్రంలో వసతులు లేవన్న కారణంతో ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న గురుకులాలను ఇప్పటికైనా తిరిగి తీసుకురావాలని కాంగ్రెస్ నాయకుడు గంగరబోయిన మహేందర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 2018లో బచ్చన్నపేట మండలానికి బాలికలు, బాలుర కోసం మంజూరైన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలను ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయటం మూలంగా ఈ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇక్కడ అనేక ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటి స్థలంలో భవనాలు నిర్మించి బచ్చన్నపేటలో పాఠశాలలు నడిచే ఏర్పాట్లు చేయాలని కోరారు.

క్రైస్తవులపై దాడి అమానుషం

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి16: శంకర్‌పల్లి మండలం జన్వాడ మెథడిస్ట్ చర్చిలో క్రైస్తవులపై జరిగిన దాడి అత్యంత అమానుషమని ప్యాసిస్ ఫెలోషిప్ ప్రతినిధులు ఖండించారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో వారు మాట్లాడుతూ క్రైస్తవులపై దాడి చేసిన 300 మంది మతచాందవాదులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జ్యోతిబాబు, బాలస్వామి, దేవవరం, తిమోతి, డాక్టర్ వెంకటస్వామి, ప్రసాద్, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



జనగామ ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 16: జిల్లాలో రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రం లోని ఏకశిల పబ్లిక్ స్కూల్ లో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రథ సప్తమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా 800 మంది విద్యార్థులకు యోగా గురువులు యోగాసనాలు వేయించారు. కార్యక్రమానికి ఏకశిలా విద్యా సంస్థల కరస్పాండెంట్ చిర్రా ఉపేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యోగాసనాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో శ్రీరామదాసు భజన మండలి రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎం.సిద్దేశ్వర్, బాలసిద్దయ్య, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ఉమా మహేశ్వర గుడిలో రథసప్తమి పూజ ఘనంగా జరిగింది. శుక్రవారం ఆలయ అర్చకులు రాజేశ్ భార్గవ ఆధ్వర్యంలో సూర్య భగవానునికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి దీపం, ధూపం, నైవేద్యం సమర్పించారు. దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చుంచు రేణుక, స్వాతి, పార్వతి పటేల్, భక్తులు పాల్గొన్నారు.

జైన రమేష్‌కు లయన్స్ లీడర్‌షిప్ అవార్డు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 16: జనగామ లయన్స్ క్లబ్ సభ్యుడు జైన రమేష్ లయన్స్ అంతర్జాతీయ లీడర్ షిప్ అవార్డు అందుకున్నారు. 2023-24 సంవత్సర కాలంలో అతని సేవలు గుర్తించి లయనిజం మిషన్, లయన్స్ అంతర్జాతీయ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పట్టి హీల్ అవార్డును ప్రకటించారు. ఇటీవల హన్మకొండ లో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. రమేష్‌కు అవార్డు రావడం పట్ల లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు, ఎస్.వెంకటేశ్వర్ రావు, ముచ్చా రాజిరెడ్డి, డాక్టర్ మాచర్ల బిక్షపతి హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బచ్చన్నపేట, ఫిబ్రవరి 16: మండలంలోని బసిరెడ్డిపల్లికి చెందిన పంజాల అంజయ్య, రాంచంద్రాపురంనకు చెందిన నర్మెట కిషన్, నాగిరెడ్డిపల్లికి చెందిన పాండవుల వెంకటేశ్ ఇటీవల తాటిచెట్టుపై నుండి పడి గాయపడ్డారు. వారి కుటుంబాలను శుక్రవారం కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బాల్నే వెంకటమల్లయ్య పరామర్శించారు.

జాతర వద్ద బందోబస్తు ఏర్పాటు చేయండి

తరిగొప్పుల, ఫిబ్రవరి 16: మండలంలోని బొంతగట్టునాగారం - బొత్తలపర్రె గ్రామాల సరిహద్దు ఏడు పోచమ్మలగడ్డకు నిర్వహించే శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతూ ఉత్సవ కమిటీ నాయకులు శుక్రవారం తరిగొప్పుల ఎస్సై అయ్యాల శ్వేతను కోరారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ సబావత్ రాజు మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు సాగే జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల శ్రేణులు



పాలకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు



దేవరుప్పులలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కార్మిక సంఘాల నిరసన ర్యాలీలు

- కేంద్రం తెచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి16: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, ఏఐకెఎస్, ఏఐఏడబ్ల్యుయూ, జేఏడియూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనపూర్ రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. జాతీయ కార్మిక సంఘాలు, కిసాన్ మోర్చాజాయింట్ యాక్షన్ కమిటీలు ఇచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో పాటుగా గ్రామీణ బంద్‌ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నిత్యావసర సరుకులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి కోడెపాక యాకయ్య, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మునిగెల రమేశ్, గొర్రెల కాపర్ల సంఘం జిల్లా సహాయకార్యదర్శి సాదం రమేశ్, లాజర్ రాజు, వేణు, లింగన్న కుమారస్వామి, యాకన్న, మోహన్, సుధాకర్, కిష్టయ్య, సట్ల రాజు, సమ్మన్న, వెంకట్‌నర్సు, రారంబాబు పాల్గొన్నారు.

పాలకుర్తి: దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు రమేష్, సీటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న మట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా కార్మిక, వ్యవసాయ కార్మిక చట్టాలను కాలరాస్తోందని విమర్శించారు. వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్ ఫ్లాగ్ జిల్లా కార్యదర్శి మాన్యపు భుజేందర్, సోమ సత్యం, మాచెర్ల సారయ్య, బత్తిని వెంకన్న, ఏదునూరి మదార్ రామచంద్రం, మాసంపల్లి నాగయ్య, అంబటి సోమయ్య పాల్గొన్నారు.

దేవరుప్పుల: దేశ వ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలో ఏఐటీయూసీ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు గోషాల శ్రీనివాస్, ఉప్పుల శ్రీనివాస్, బెజుగం ఎల్లయ్య, శంకరయ్య, ఎండీ. యాఖూబ్‌పాషా, సుధాకర్, జీడి నర్సింహా, చెన్నయ్య పాల్గొన్నారు.

బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించాలి: ఏసీపీ

జఫర్‌గడ్, ఫిబ్రవరి 16 : టెన్త్ వార్షిక పరీక్షల్లో బాలికలు ఉత్తమ అత్యుత్తమ గ్రేడ్లను సాధించాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఉద్బోధించారు. శుక్రవారం ఆయన జఫర్‌గడ్‌లోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో టెన్త్ విద్యార్థినులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ సమత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరీక్షల సన్నద్ధత, ఉత్తమ ఫలితాల సాధనపై ఏసీపీ నర్సయ్య విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా పట్టుదల, ఏకాగ్రతతో చదవాలన్నారు. ఎలాంటి ఒత్తిడులకు గురికావద్దన్నారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాలను ఎంచుకుని, వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని ఉద్బోధించారు. అంతకు ముందు ఆయన జఫర్‌గడ్ పోలీసు స్టేషన్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వర్ధన్న పేట సీఐ సూర్యప్రకాశ్, జఫర్‌గడ్ ఎస్‌ఐ మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జఫర్‌గడ్ సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి : సీఐ

పాలకుర్తి: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల ఎస్సై సాయి ప్రసన్న కుమార్‌తో కలిసి అవగాహన కల్పించారు. మొబైల్, ల్యాప్‌టాప్ వినియోగం పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా, ఓటీపీ అడిగినా సమాధానం ఇవ్వకూడదన్నారు. విద్యార్థులు మొబైల్ వినియోగాన్ని తగ్గించే విధంగా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం పడుతున్న శ్రమను పిల్లలు గుర్తించాలని అన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, రమేష్, పోలీస్ సిబ్బంది భాస్కర్, సోమిరెడ్డి, రవీందర్, రాజశేఖర్, యాకన్న, యాంబరం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి..

రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాయి ప్రసన్నకుమార్‌తో కలిసి వ్యాపారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే మోటార్ వెహికల్ యాక్ట్, టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద జరిమాన విధిస్తామని అన్నారు.



మల్యాపూర్‌లో లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్న అనిల్ కుమార్

త్వరలోనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం

జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

చిలుపూర్, ఫిబ్రవరి 16: స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమం కింద వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నవారికి త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని జడ్పీ సీఈవో కె.అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మల్యాపూర్ గ్రామాన్ని సందర్శించిన ఆయన వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న వారి వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొత్తం 317 వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్క లింగంపల్లిలోనే 209 మంది ఉన్నారని అన్నారు. అర్హులందరి వివరాలను సేకరించి త్వరలోనే వారి బ్యాంకు ఖాతాల్లో బిల్లులను జమ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఈజీఎస్ ఏపీవో మోహన్‌రావు, ఈసీ సింగపురం కిరన్, కార్యదర్శులు పన్నీరు మధుసూదన్, ఫీల్డ్ అసిస్టెంట్ కెంగర్ల మల్లేష్, ఎన్నకూస రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన మానిటరింగ్ బృందం

- టెన్త్ విద్యార్థుల అంతర్గత మార్కులపై పరిశీలన

జఫర్‌గడ్, ఫిబ్రవరి 16 : మండలంలోని పలు జడ్పీ హైస్కూళ్లలో పదవ తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల నమోదును శుక్రవారం మానిటరింగ్ పరిశీకుల బృందం పరిశీలించింది. టెన్త్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో పదవతరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలనకు గాను విద్యాశాఖ ప్రత్యేకంగా మానిటరింగ్ పరిశీలక బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఎఫ్ఏ-1 నుంచి ఎఫ్ఏ-4 వరకు ప్రతీ సబ్జెక్టుకు విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలు, ప్రాజెక్టు వర్క్, టెక్ట్ బుక్స్ రైటింగ్ వంటి అంశాలకు వేసిన అంతర్గత మార్కులపై పరిశీలన చేస్తాయి. ఇందులో భాగంగా మానిటరింగ్ పరిశీలక బృందం ప్రతినిధులు మంగు జయప్రకాశ్, పెనుమాటి వెంకటేశ్వర్లు, కాసర్ల రమేశ్‌బాబు శుక్రవారం మండలంలోని హిమ్మత్‌నగర్, తమ్మడపల్లి(జి), జఫర్‌గడ్, తిడుగు ఉన్నత పాఠశాలలతో పాటు మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకులం, ఆదర్శ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు రికార్డులు సరిగా రాశారా, లేదా? వాటికి సబ్జెక్టు ఉపాధ్యాయులు సరైన విధంగా మార్కులు వేశారా, లేదా? అనే అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రతినిధి మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ టెన్త్ వార్షిక పరీక్షల్లో బాలబాలికలు ఎలాంటి ఆందోళనలు చెందకుండా, చక్కగా చదివి అత్యుత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు.



తమ్మడపల్లి(జి) హైస్కూల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సభ్యులు

సంస్మరణ సభను జయప్రదం చేయాలి

పాలకుర్తి, ఫిబ్రవరి 16 : ఈ నెల 18న హన్మకొండలోని భీమారం రోడ్డులోని పేరియార్ భవన్‌లో జరిగే భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవసాపకుడు జయగోపాల్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కమిటీ సభ్యుడు జి. సాంబయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జయగోపాల్ అనేక దేశాల్లో మత, మూఢ విశ్వాసాల వల్ల ప్రజలు నష్టపోతున్న తీరును ఆయన ప్రజలకు వివరించారని, యుద్ధాల వల్ల మానవహననం జరుగుతున్న తరుణంలో అనేక దేశాధినేతలకు ఉత్తరాలు రాసి హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి జయగోపాల్ అని కొనియాడారు. సంసంస్మరణ సభకు తరలిరావాలని కోరారు.

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య

(3వ పేజీ తరువాయి)

మాలోతు నెహ్రూనాయక్ ఉన్నారు. మిగతా ఇద్దరిలో వికారాబాద్‌కు చెందిన మల్కుడ్ రమేశ్, సూర్యాపేటకు చెందిన సంకెపల్లి సుధీర్‌రెడ్డికి చోటు దక్కింది.

పార్లమెంట్ ఆశావహుల రేసు నుంచి పక్కకు..

సిరిసిల్ల రాజయ్యకు ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో ఇక ఆయనకు వరంగల్ పార్లమెంట్ టికెట్ తలుపులు మూసివేసినట్లే అయ్యింది. వరంగల్ పార్లమెంట్ ఆశావహుల్లో ముఖ్యులుగా సిరిసిల్ల రాజయ్య ఉన్నారు. గతంలో ఆయన ఎంపీగా పని చేయడం, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి పగ్గాలు చేపట్టకు ముందు నుంచే ఆయనకు మద్దతుదారుడిగా ఉండడంతో రేవంత్‌రెడ్డికి కూడా రాజయ్యకు పదవి కల్పన బాధ్యతగా పరిణమించింది. వరంగల్ పార్లమెంట్ టికెట్ రేసులో పోటీ అధికంగా ఉండడం, టికెట్ కేటాయింపు భారమైన తరుణంలో రాజయ్యకు సముచిత స్థానం కల్పించాలనే నిర్ణయంతో రేవంత్‌రెడ్డి స్టేట్ కమిషన్ చైర్మన్‌గా నియమించారనే అంచనాలు జిల్లా పార్టీ వర్గాల్లో నెలకొన్నాయి. రాజయ్యకు నామినేటెడ్ పోస్టు దక్కడంతో పార్లమెంట్ టికెట్ రేసు నుంచి ఒకరు తప్పినట్లైయ్యింది. దీంతో మిగతా ఆశావహులు కూడికలు, తీసివేతల్లో తలమునకలయ్యారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుల్లో ఒకరైన మహబూబాబాద్‌కు చెందిన మాలోతు నెహ్రూ నాయక్ కూడా అసెంబ్లీ టికెట్‌ను ఆశించిన వారే. ఆయనకు కూడా సభ్యుడిగా బాధ్యతలు అప్పగించి న్యాయం చేశారనే అభిప్రాయాలు నెలకొన్నాయి.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



కళ్లెం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

లింగాలఘణపురం, ఫిబ్రవరి16: మండలంలోని కళ్లెం జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి ధర్మం గొప్పతనాన్ని తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవోగా శివకుమార్, ఎంఈవోగా అరవింద్, హెచ్ఎంగా బోయిని నవ్య వ్యవహరించారు. కాగా హెడ్మాష్టర్ పాశికంటి యాదగిరి విద్యార్థులను అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు కోమల్ల విద్యార్థి

రఘునాథపల్లి, ఫిబ్రవరి 16: హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు కోమల్ల గ్రామానికి చెందిన తాళ్లపల్లి పృథ్వీ ఎంపికయ్యాడు. హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన పృథ్వీ కరీంనగర్‌లోని రేపర్తి లయోలా ఇన్‌స్టూట్‌లో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడని పీఈటీ సత్రం హరి తెలిపారు.

దర్దేపల్లిలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

పాలకుర్తి, ఫిబ్రవరి 16 : మండలంలోని దర్దెపల్లి గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ వెంకటేశం, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్ హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జడ్పీ నిధులతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడం మంచి పరిణామమని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు ఇమ్మడి ప్రకాష్, మంద సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 16: మండలంలోని పోచన్నపేట, తమ్మడపల్లి గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. పోచన్నపేట అధ్యక్ష కార్యదర్శులుగా అకిరెడ్డి శ్రీధర్, అవదూత ఉమేష్, ఉపాధ్యక్షులుగా నర్సింగ ఎల్లేశ్, నర్మెట బాల్‌రాజు, దత్తరపు లాజర్, సహాయ కార్యదర్శులుగా చొప్పరి కొమురయ్య, సంగమల్ల మల్లేశ్, కోశాధికారిగా రేణుకుంట గణేశ్‌తో పాటు కార్యదర్శ సభ్యులను ఎన్నుకున్నారు. తమ్మడపల్లిలో అధ్యక్షకార్యదర్శులుగా దాసరి శ్రీనివాస్‌రెడ్డి, పయ్యావుల రాజు, ఉపాధ్యక్షులుగా దొమ్మాట శ్రీనివాస్, బోడిగం లింగారెడ్డి, సహాయ కార్యదర్శులుగా సిద్దయ్య, మధుసూదన్‌రెడ్డి, కోశాధికారిగా కొమ్ము సిద్దయ్య, యూత్ అధ్యక్షుడిగా దొమ్మాట చందును ఎన్నుకున్నారు.

ఫలించిన ప్రయోగం



చిలుపూర్ ఉన్నత పాఠశాల

స్కూల్ బ్యాంక్ నెలకొల్పిన ఉపాధ్యాయుడు

పదహారు నెలల్లోనే రూ.లక్ష దాటిన డిపాజిట్లు

పొదుపు చేసేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

చిలుపూర్, ఫిబ్రవరి 16: మామూలుగా అయితే పాఠశాల స్థాయి విద్యార్థులకు పాకెట్ మనీ ఇస్తే వెంటనే ఏ కిరాణానికో వెళ్లి ఖర్చు పెట్టేస్తారు. కాని చిలుపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పిల్లలు అలా కాదు. వీరు తమ స్కూల్ బ్యాంక్‌లో జమ చేసుకుంటారు. ఈ సత్సంకల్పానికి కారణం ఆ పాఠశాల ఉపాధ్యాయుడే. కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం మన ఊరు - మన బడి కార్యక్రమం చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించడంతో పాటు, అధునాతన సౌకర్యాలను సమకూర్చింది. ఈ క్రమంలోనే చిలుపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కనీస అవసరాలకు ఉపయోగపడే విధంగా వారి వారి తల్లిదండ్రులిచ్చే పాకెట్ మనీని దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు గాను ఓ ఉపాధ్యాయుడు వినూత్నంగా ఆలోచించి స్కూల్ బ్యాంక్‌ను నెలకొల్పేందుకు తెరలేపాడు. నేడు ఆ బ్యాంక్ సక్సెస్ బాటలో పయనిస్తోంది. ఇటీవల నాబార్డు బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీలతో పాటు, ఇతర బ్యాంక్‌ల అధికారులు సైతం స్కూల్ బ్యాంక్‌ను సందర్శించారు. విద్యార్థులు చేస్తున్న కృషిని అభినందించడంతో పాటు, వారు సైతం స్కూల్ బ్యాంక్‌లో ఖాతాను ప్రారంభించి కొంత నగదును జమ చేశారు. దీంతో బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు విద్యార్థులకు మెటీరియల్ (రిజిష్టర్ల)ను సైతం అందించి తనవంతుగా సహకరిస్తున్నారు.



లావాదేవీలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏడాదిన్నర క్రితమే ప్రారంభం...

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అక్టోబరు 15 2022న స్థాపించిన ఈ స్కూల్ బ్యాంకులో అనతికాలంలోనే రూ.1లక్షకు పైగా విద్యార్థులు తమతమ పాకెట్ మనీని జమ చేశారు. బ్యాంకు నిర్వహణకు సైతం ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. ఉదయం 9.00 నుంచి 9.30, మధ్యాహ్నం 1.15 నుంచి 1.45, సాయంత్రం 4.00 నుంచి 4. 30 వరకు నిర్ణయించారు.

డబ్బులు పోస్టాఫీస్‌లో వేస్తా: అర్చన(విద్యార్థిని), మేనేజర్



స్కూల్ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహించడంతో నాపై మరింత బాధ్యత పెరిగింది. పాఠశాలలో మొత్తం 158 మంది విద్యార్థులు ఉన్నారు. వారు జమ చేసిన డబ్బులను ఎప్పటికప్పుడు పోస్టాఫీస్‌లో జమ చేస్తున్నాం.

డబ్బులు వృథా కావడం లేదు: శ్రీజ (విద్యార్థిని), క్యాషియర్



తల్లిదండ్రులు వారి వారి పిల్లల కోసం ఇచ్చే రోజూవారీ పాకెట్ మనీ ప్రస్తుతం వృథా కావడం లేదు. తోటి విద్యార్థులంతా డబ్బులను పొదుపు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. క్యాషియర్‌గా బాధ్యతలు చేపట్టిన నేను బ్యాంక్ లావాదేవీలను సక్రమంగా నిర్వహిస్తున్నా.

విద్యార్థుల్లో అవగాహన పెరిగింది..

దాసి శ్రవణ్ కుమార్, హెచ్‌ఎం



మా పాఠశాలలో స్కూల్ బ్యాంక్ నెలకొల్పడంతో డబ్బులను పొదుపు చేయడంపై విద్యార్థుల్లో అవగాహన పెరిగింది. ప్రాథమిక దశలోనే పొదుపుపై అవగాహన కల్పించడం వల్ల వారికి ఆర్థిక భరోసా నింపిన వాళ్ళమవుతున్నాం. పొదుపు చేసేందుకు విద్యార్థులు సైతం ఆసక్తి చూపుతున్నారు.

నా ప్రయత్నం ఫలించినందుకు సంతోషంగా ఉంది..

వెంకటేశ్వర్లు, బ్యాంక్ నెలకొల్పిన ఉపాధ్యాయుడు



2017లో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో పాల్గొన్న నేను అదే స్ఫూర్తితో విద్యార్థుల్లో ఆర్థిక భరోసా నింపడం కోసం ఈ బ్యాంకును ఏర్పాటు చేశాను. నా ప్రయత్నం సఫలం కావడం సంతోషంగా ఉంది.